నిరాశలో పత్తిరైతు



పత్తి రైతుకు ఈయేడు కాలం కలిసి రాలేదు. రెండేళ్ల పాటు లాభాలు పండించిన రైతులు ఈసారి నష్టాలు చవి చూస్తున్నారు. వేలకు వేలు పెట్టుబడి పెట్టి సాగు చేస్తే ప్రతికూల వాతావరణంతో అంతంత మాత్రమే దిగుబడులు వచ్చాయి. వచ్చిన పంటను అమ్ముకునేం దుకు ధర లేకపోవడంతో దిగాలు పడిపోతున్నారు.

నెన్నెల, డిసెంబరు 4: పత్తి రైతులు కుదేలవుతున్నాడు. పత్తి ధర రోజురోజుకు పడిపోతోంది. బహిరంగ మార్కెట్లో ప్రస్తుతం క్వింటాల్ పత్తి ధర రూ. 6500లు ఉంది. గ్రామాల్లో వ్యాపారులు రూ.6 వేలకే కొనుగోలు చేస్తున్నారు. గతేడాది రూ. 10వేల వరకు, 2022లో రూ.12 వేలకు పలికింది. ఈయేడు అవే ధరలు కొనసాగుతాయని ఆశించిన రైతులు అధిక విస్తీర్ణంలో సాగు చేశారు. వాతావరణ పరిస్థితులు, చీడపీడలు దాడితో దిగుబడులు అంతంత మాత్రమే వచ్చాయి. పెట్టిన పెట్టు బడుల దృష్ట్యా ప్రస్తుతం లభిస్తున్న ధర గిట్టుబాటు కాదని రెతులంటున్నారు.

• ధర లేక దిగులు...

దిగుబడి తగ్గితే ధర పెరుగుతుంది. దిగుబడి పెరిగితే ధర తగ్గుతుంది ఇది సాధారణ మార్కెట్ సూత్రం. పత్తి కొనుగోళ్ల విషయంలో ఈ సూత్రం తిరగబడింది. పత్తి దిగుబడి తగ్గినప్పటికి ధర మాత్రం పెరగడం లేదు. రోజు రోజుకు ధర పడిపోతోంది. గతేడాది క్వింటాల్ రూ.10 వేల పైనే పలికిన ధర ఈ ఏడు రూ.6500లకు పడిపోయింది. సీజన్ ప్రారంభంలో మురిపించిన ధర రోజురోజుకు పతనమవుతోంది. సీజన్ ప్రారంభంలో క్వింటాలుకు రూ.8 వేలు పలికింది. రూ.పది వేల వరకు చేరుతుందని ఆశించిన రైతులకు నిరాశే ఎదురైంది. ప్రభుత్వ మద్దతు ధర రూ. 7020 ఉండగా ప్రస్తుతం బహిరంగ మార్కెట్లో పత్తి రూ.6500 పలుకుతోంది. అంతర్జాతీయ మార్కెట్లో పత్తికి డిమాండ్ పడిపోతున్నదని వ్యాపారులు అంటున్నారు. ఫలితంగా ఇక్కడి పత్తికి ధర తగ్గుతున్నదని చెబుతున్నారు. మహారాష్ట్ర, గుజరాత్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో పత్తి అమ్మకాలు జోరందుకోవ డంతో ధరపై ప్రభావం పడుతున్నదని జిన్నింగ్ మిల్లర్లు అంటున్నారు. పత్తి బేళ్లు, గింజల ధర పడిపోవడం మరో కారణంగా చెబుతున్నారు.

• సీసీఐతో ఇబ్బందులు

బహిరంగ మార్కెట్లో పత్తికి డిమాండ్ లేక ప్రస్తుతం సీసీఐ ద్వారా కొనుగోళ్లు సాగుతున్నాయి. ప్రభుత్వ మద్దతు ధర రూ.7020 ఉంది. గిట్టుబాటు ధర పొందాలంటే సీసీఐ నిబంధనలు పాటించాలి. తేమ శాతం 8 కంటే ఎక్కువ ఉంటే ధరలో కోతలు విధిస్తున్నారు. రైతు గుర్తిం పు కార్డు తప్పనిసరి, ఆధార్, ఫోన్ నంబరు అనుసంధానమైన బ్యాంకు ఖాతా ఉండాలని అంటున్నారు. పత్తి సాగు చేసిన రైతుల్లో కొందరివి ఆన్‌లైన్‌లో వేరే పంటలుగా నమోదయ్యాయి. అలాంటి రైతుల పత్తిని అధికారులు తిరస్కరిస్తున్నారు. వ్యవసాయ అధికారులతో ధ్రువీకరణ పత్రం తీసుకురావాలని కోరుతున్నారు. కౌలు రైతులు పత్రాలు లేక సీసీఐలో అమ్ముకోలేక పోతున్నారు. ప్రభుత్వ సెలవు దినాలతో పాటు ఒక్కోసారి ఐదేసి రోజులు కొనుగోళ్లు నిలిపి వేస్తుండటంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

- కాలం కలిసిరాక తగ్గిన దిగుబడి
- ధర లేక నష్టాల పాలు
- బహిరంగ మార్కెట్‌లో క్వింటాల్‌కు రూ. 6500లు
- గిట్టుబాటు కాదంటున్న రైతులు

• అంతంతమాత్రపు దిగుబడులు

జిల్లాలో ఈయేడు 1.55 లక్షల ఎకరాల్లో పత్తి సాగైంది. సీజన్ ప్రారంభంలో మురిపించిన వర్షాలు ఆ తరువాత ముఖం చాటేశాయి. పత్తి చేన్లు సరిగ్గా ఎదగలేదు. చీడపీడల దాడితో ఎకరాలకు ఎకరాల చేలల్లో కాయలు పుచ్చిపోయాయి. మరి కొన్ని చోట్ల లూజు విత్తనాలు వేసిన చేలల్లో మొక్కలు ఏపుగా పెరిగాయి. పూత, కాత అంతంత మాత్రంగా వచ్చింది. అష్టకష్టాలు పడి తెగుళ్ల బెడదను తప్పించుకు న్నారు.ఎకరానికి 10 నుంచి 13 క్వింటాళ్ల దిగుబడి రావాల్సింది... ఆరు.. ఏడు క్వింటాళ్లకు పైబడి రావడం లేదని రైతులంటున్నారు.

• పెరిగిన పెట్టుబడి

పత్తి పంటలో ఖర్చులు భారీగా పెరిగాయి. విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, కూలీలు, యంత్రాల కిరాయి రూపంలో పెట్టుబడులు రెట్టింపయ్యాయి. దుక్కి దున్నడం నుంచి పత్తి సేకరించే వరకు ఎకరానికి రూ.50 వేల వరకు ఖర్చు చేయాల్సి వస్తోంది. ఎన్నడు లేనిది ఈ సారి గులాబీ రంగు పురుగు, లద్దెపురుగు సోకడంతో నివారణ ఖర్చు మరింత పెరిగింది. పెట్టుబడి తడిసిమోపెడు కాగా అందుకు తగ్గ ధర అందక రైతులు కుంగిపోతున్నారు. స్థానికంగా కూలీల కొరత ఉండటంతో పొరుగు రాష్ట్రాల నుంచి కూలీలను తీసుకురావాల్సి వచ్చింది. వారికి కిరాయిలు, నిత్యావసర వస్తువులు, బస ఏర్పాట్లు తలకు మించిన భారంగా మారింది. క్వింటాలు పత్తి సేకరణకు రూ. వెయ్యి నుంచి రూ. 1200ల వరకు చెల్లించాల్సి వస్తోంది. వీటన్నింటికి తోడు ఎకరానికి రూ.10 వేలు ఉన్న కౌలు ధర రూ. 16 వేల వరకు పెరిగింది. అన్ని పెరిగినప్పటికి పత్తి ధర మాత్రం పెరగలేదు. పత్తి ధర క్వింటాలుకు రూ.10 వేల పైబడి ఉంటేనే కొంత లాభం ఉంటుందని రైతులంటున్నారు.

రూ. 10 వేలు ఉంటేనే గిట్టుబాటు

-కొండపల్లి శరత్, రైతు, నందులపల్లి



సాగు పెట్టుబడులు రెట్టింపయ్యాయి. కూలీల ధర పెరిగింది. కౌలు,.ఎరువులు, పురుగు మందులు ఇలా అన్నింటికి ధరలు పెరుగుతున్నాయి. పత్తి ధర మాత్రం పెరగడం లేదు. నిరుడు క్వింటాలుకు రూ.9 వేలకు పైనే పలికింది. ఈసారి కూడా ధర పెరుగుతుందని ఎదురు చూస్తున్నాం. ధర రోజురోజుకు తగ్గుతోంది. అంతంత మాత్రపు వచ్చిన దిగుబడులతో పెట్టుబడి సైతం రావడం లేదు.

క్యాంపునకు బయలుదేరిన కౌన్సిలర్లు

12న సమావేశం



బస్సులో బయలుదేరుతున్న బీఆర్ఎస్ కౌన్సిలర్లు

బెల్లంపల్లి, జనవరి 4: బెల్లంపల్లి మున్సిపల్ రాజకీయాలు రసవత్తరంగా మారాయి. అసమ్మతి కౌన్సిలర్లు అవిశ్వాసం వైపే మొగ్గు చూపుతున్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత, వైస్ చైర్మన్ బత్తుల సుదర్శన్‌పై అవిశ్వాసం పెట్టాల్సిందేనని పట్టుబడుతున్నారు. ఇటీవల కలెక్టర్‌కు చైర్‌పర్సన్, వైస్‌చైర్మన్‌పై అవిశ్వాసం పెట్టేందుకు నోటీసులు అందజేయడంతో ఈనెల 12న అవిశ్వాసానికి సంబంధించిన సమావేశం నిర్వహించేందుకు కలెక్టర్ సంతోష్ నోటీసులు జారీ చేశారు. దీంతో గురువారం బీఆర్ఎస్ పార్టీకి చెందిన 18 మంది కౌన్సిలర్లు ప్రత్యేక బస్సులో క్యాంపునకు వెళ్లినట్లు తెలుస్తోంది. పట్టణంలో మొత్తం 34 వార్డులున్నాయి. ఇందులో కాంగ్రెస్ పార్టీకి చెందిన 11 మంది కౌన్సిలర్లు ఉండగా బీఆర్ఎస్‌కు చెందిన 21 మంది, బీజేపీకి ఒక కౌన్సిలర్ ఉన్నారు. ప్రస్తుత మున్సిపల్ చైర్ పర్సన్ జక్కుల శ్వేత బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్ పార్టీలో చేరగా కాంగ్రెస్ కౌన్సిలర్ల సంఖ్య 12కు చేరింది. శిబిరానికి వెళ్లిన వారిలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన గోసిక రమేష్ చైర్‌పర్సన్ అభ్యర్థిగా, వైస్‌చైర్మన్‌గా ఎండీ అఫ్సర్‌లను బరిలో ఉంచేందుకు నిర్ణయించుకున్నారు. బీఆర్ఎస్ పార్టీకి చెందిన 18 మంది కౌన్సిలర్లు మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌లపై అవిశ్వాసం పెట్టేందుకు క్యాంపునకు వెళ్లడంతో రాజకీయం రసవత్తరంగా మారింది. కాంగ్రెస్ పార్టీకి చెందిన ఇద్దరు కౌన్సిలర్లు చైర్మన్, వైస్‌చైర్మన్ పదవుల కోసం పావులు కదుపుతున్నారు. ఇటీవల కాంగ్రెస్ పార్టీలో చేరిన చైర్‌పర్సన్ జక్కుల శ్వేత ఎమ్మెల్యే గడ్డం వినోద్ మద్దతు కోసం ప్రయత్నాలు చేస్తోంది.

రైలెక్కిన బస్సు...



బెల్లంపల్లి, జనవరి 4: ఆర్మీ అధికారులకు సంబంధించిన బస్సులు, లారీలు, జీపులు తమిళనాడు రాష్ట్రం నుంచి న్యూఢిల్లీకి రైలుపై తరలిస్తున్నారు. గురువారం బెల్లంపల్లి రైల్వేస్టేషన్‌లో అరగంటకు పైగా రైలును నిలిపివేశారు. స్టేషన్‌లో ఉన్న ప్రయాణికులు వాటి ఫొటోలు తీశారు.

నేడు గూడెం ఆలయ హుండీ లెక్కింపు

దండేపల్లి, జనవరి 4: గూడెం సత్యనారాయణ స్వామి దేవస్థానంలో శుక్రవారం హుండీలను లెక్కిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి సంకటాల శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10 గంటల నుంచి సత్యదేవున్ని ప్రధానాలయంలో లెక్కిస్తామన్నారు.

వైభవంగా భైరవ జయంతి



పూజలో పాల్గొన్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్

కోటపల్లి, జనవరి 4: భైరవ జయంతి వేడుకలు గురువారం పారుపెల్లి గ్రామంలో వైభవంగా జరిగాయి. భైరవాష్టమిని పురస్కరించుకుని పారుపెల్లిలోని భైరవగుట్టపై ఉన్న దేవాలయంలో ఉదయం నుంచే భక్తులు బారులు తీరారు. పండితుల వేద మంత్రోచ్ఛారణల మధ్య ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం యజ్ఞహోమాదుల క్రతువు నిర్వహించారు. భక్తులకు అన్నప్రసాదాలు అందించారు. కోటపల్లి, చెన్నూరు, మంచిర్యాల, బెల్లంపల్లి, వేమనపల్లి తదితర మండలాలతోపాటు మహారాష్ట్ర, హైద్రాబాద్‌లకు చెందిన భక్తులు హాజరయ్యారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్, జడ్పీ మాజీ వైస్ చైర్మన్ మూల రాజిరెడ్డిలు ప్రత్యేక పూజలు చేశారు. వేలాది మంది భక్తులు తరలి రావడంతో ఆలయ కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేయగా ఎస్ఐ సురేష్ ఆధ్వర్యంలో బందోబస్తు చేపట్టారు.

పలురైళ్ల రద్దుతో ప్రయాణికుల అవస్థలు

బెల్లంపల్లి, జనవరి 4: బిజిగిరి షరీఫ్ రైల్వే ట్రాక్ వద్ద పనులు చేపడుతుండడంతో శుక్రవారం రైల్వే శాఖ పలు రైళ్లను రద్దు చేసింది. దీంతో ప్రయాణీకులు ఇబ్బందులు పడ్డారు. సిర్పూర్ కాగజ్‌నగర్ నుంచి సికింద్రాబాద్ వెళ్లే భాగ్యనగర్, ఇంటర్ సిటీ, సింగరేణి రైళ్లతో పాటు పలు ప్యాసింజర్ రైళ్లు రద్దయ్యాయి. దీంతో రైల్వేస్టేషన్‌కు వచ్చిన ప్రయాణికులు ఇబ్బందులకు గురయ్యారు. అలాగే ఎక్స్‌ప్రెస్ రైళ్లు సైతం దాదాపు 2 గంటలకు పైగా ఆలస్యంగా నడిచాయి.

వన భోజనాలకు బస్సులు కేటాయించొద్దు



డీఎంకు వినతిపత్రం అందిస్తున్న ఉద్యోగులు

మంచిర్యాల కలెక్టరేట్, జనవరి 4: వనభోజనాలకు బస్సులు కేటాయించవద్దని గురువారం ఆర్టీసీ డిపో మేనేజర్ రవీంద్రనాథ్‌కు ఉద్యోగులు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ వన భోజనాలకు సిబ్బంది, బస్సులు కేటాయించడం వల్ల సంస్థకు ఆదాయం తగ్గుతుందన్నారు. డీఏ ఏరియర్స్, జీతభత్యాలకు సంబం ధించిన డబ్బులను సకాలంలో చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. నూతన బస్సులను కొనుగోలు చేసేందుకు యాజమాన్యం నిర్ణయం తీసుకునేలా చూడాలని విన్నవించారు.

చలో పార్లమెంట్ కరపత్రాలు విడుదల



కరపత్రాలను విడుదల చేస్తున్న ఎస్ఎఫ్ఐనాయకులు

చెన్నూరు, జనవరి 4: ఉచిత విద్య, ఉపాధి కల్పనకు ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 12న చేపట్టిన చలో పార్లమెంట్ కరపత్రాలను గురువారం ఎస్ఎఫ్ఐ నాయకులు విడుదల చేశారు.జిల్లా అధ్యక్షుడు దాగం శ్రీకాంత్ మాట్లాడుతూ విద్యారంగాన్ని నిర్వీర్యం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం 3 శాతం నిధులు కేటాయిస్తుందని, ఇది సరైంది కాదని, కనీసం 20 శాతం నిధులు కేటాయించి విద్యారంగాన్ని బలోపేతం చేయాలన్నారు. అనిల్, దినేష్, శేఖర్, మహేష్, అంజన్న, సాయి, రాజేందర్ పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం అందజేత

మందమర్రిరూరల్, జనవరి 4: అందుగులపేట గ్రామానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్త రామంచె రాములు ఇటీవల మృతిచెందగా ఆయన కుటుంబాన్ని గురువారం కాంగ్రెస్ పార్టీ మండల ఇన్‌చార్జి కడారి జీవన్‌కుమార్ పరామర్శించారు. రూ. 5 వేల నగదును అందజేశారు. కొండపర్తి సందీప్, కాల్వ కుమార్, ఎండీ నాజర్, అంకం రాజ్‌కుమార్‌లు కలిసి రూ.5 వేల సహాయం అందజేశారు.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెరగాలి



మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి సుబ్బారాయుడు


మందమర్రి టౌన్, జనవరి 4: ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవాల సంఖ్య పెరగాలని డీఎంహెచ్‌వో డా.సుబ్బారాయుడు తెలిపారు. గురువారం ప్రభుత్వ ఆసుపత్రిలో సిబ్బందితో నిర్వహించిన డెలివరీ, పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు, కుటుంబ నియంత్రణ సదస్సులో మాట్లాడారు. గర్భిణులకు సంబంధించి ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు వివరాలు సేకరించాలన్నారు. ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స ప్రసవం చేయించుకునేలా చూడాలని పేర్కొన్నారు. అంతే కాకుండా చిన్నారుల ఆరోగ్య స్థితిగతులను పరిశీలించుకోవాలన్నారు. చిన్నారుల ఆరోగ్యానికి సంబంధించి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. పిల్లల టీకాలకు సంబంధించిన రికార్డులు పక్కాగా ఉండాలన్నారు. గర్భిణుల ఆరోగ్యంపై అవగాహన కల్పించాలని తెలిపారు. సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వహించి ప్రజారోగ్యానికి కృషి చేయాలన్నారు. జిల్లా ప్రోగ్రాం అధికారి ఫయాజ్, వైద్యాధికారి రమేష్, సీహెచ్ గంగాధర్, ఏఎన్ఎంలు, తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధమైన జీవనశైలిని అలవర్చుకోవాలి

మంచిర్యాల కలెక్టరేట్: ప్రతి ఒక్కరూ ప్రణాళికాబద్ధమైన జీవనశైలిని అలవర్చుకోవాలని డీఎంహెచ్‌వో సుబ్బారాయుడు పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో టొబాకో ఫ్రీ, మానసిక సమస్యలు అనే అంశంపై అవగాహన సదస్సు పోస్టర్లను విడుదల చేశారు. అనంతరం మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ ఆరోగ్య కరమైన అలవాట్లను ఏర్పర్చుకోవాలని, ఆశావాహ దృక్పథంతో ఉండాలన్నారు. రోజు వ్యాయాయం, సమయానికి భోజనం చేయాలని దీనివల్ల అనారోగ్య సమస్యలు తలెత్తవన్నారు. మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపర్చుకునేందుకు ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేశామని, కార్యాలయంలోని 14416 టోల్ ఫ్రీ నంబర్‌లో సంప్రదించాలని కోరారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో పూర్ణిమ, వైద్యాధికారులు అనిత, ఫయాజ్‌ఖాన్, సూప రింటెండెంట్ వెంకటేశ్వర్ రెడ్డి, లింగారెడ్డి, బుక్కా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.







ద్విచక్ర వాహనాల దొంగ అరెస్టు

జగిత్యాల టౌన్, జనవరి 4 : జగిత్యాల జిల్లా కేంద్రంలో కొన్ని రోజులుగా ద్విచక్ర వాహనాలను అపహరించుకవెళుతున్న దొంగను జగిత్యాల పట్టణ పోలీసులు పట్టుకున్నారు. గురువారం రాత్రి టౌన్ పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీ వెంకట స్వామి విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. జిల్లా కేంద్రంలోని తారకరామ నగర్ ప్రాంతానికి చెందిన బాణాల చిరంజీవి అనేయువకుడు వ్యసనాలకు బానిసై దొంగగా మారాడు. పట్టణంలోని పలు ప్రాంతాల్లోని తమఇళ్లముందు నిలిపిన వాహనాలను అపహరించుకవెళ్లి విక్రయించి సొమ్ముచేసుకోవడం చిరంజీవి ప్రవృత్తిగా మార్చుకున్నాడు. వరుసగా ద్విచక్ర వాహనాలు చోరీకి గురి కావడంతో జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు టౌన్ సీఐ నటేష్ ఆధ్వర్యంలో పోలీసులు గురువారం పట్టణంలోని పలుప్రాంతాల్లో విస్తృతతనిఖీలు నిర్వహించారు. కొత్త బస్టాండ్ ప్రాంతంలో అనుమానస్పద స్థితిలో ద్విచక్రవాహనంపై వెళుతున్నవ్యక్తి పట్టుకుని విచారించారు. ద్విచక్రవాహనాల దొంగగా గుర్తించి10 వాహనాలను స్వాధీనం చేసుకుని కేసునమోదుచేసి రిమాండ్ తరలించినట్లు డీఎస్పీ వివరించారు.

విద్యుత్ మోటార్లు, కేబుళ్లను చోరీ చేస్తున్న వ్యక్తి పట్టివేత

కోల్‌సిటీ, జనవరి 4: గోదావరిఖనిలోని నూతనంగా నిర్మిస్తున్న ఇళ్లలో విద్యుత్ వైర్లను, గ్రామలోని పొలాల వద్ద ఉన్న మోటార్లను, విద్యుత్ వైర్లను చోరీ చేస్తున్న ఎన్‌టీపీసీ పొరట్‌పల్లికి చెందిన మేకల రాకేష్ అనే వ్యక్తిని గోదావరి వంతెన వద్ద జనగామ గ్రామస్థులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. మార్కండేయకాలనీ, దుర్గానగర్, ఆర్‌టీసీ కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న ఇళ్లలో విద్యుత్ వైర్ల చోరీకి పాల్పడుతున్న వ్యక్తిని అదుపులోకి తీసుకోగా ఎన్‌టీపీసీకి చెందిన నలుగురు ఒక ముఠాగా ఏర్పడి చోరీలకు పాల్పడుతున్నట్టు తెలుస్తున్నది. కాగా అదుపులోకి తీసుకున్న వ్యక్తిని పోలీసులు విచారిస్తున్నారు.

మూలనపడిన ఓపెన్ జిమ్‌లు

● పరికరాల మరమ్మతులపై పట్టింపు కరువు

● అధికారుల పర్యవేక్షణ లోపంతో నిధులు వృథా



కళాశాల మైదానంలో విరిగి కింద పడిన జిమ్ పరికరం

లక్సెట్టిపేట రూరల్, జనవరి 4: లక్సెట్టిపేట మున్సిపాలిటీ పరిధి ఐదు వార్డుల్లో ఓపెన్ జిమ్‌లు ఏర్పాటుచేశారు. ప్రస్తుతం వాటి నిర్వహణ లేక మూలనపడ్డాయి. 2021 పట్టణ ప్రగతిలో భాగంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో, మోదెల ఆరో వార్డులో ప్రభుత్వ పాఠశాల ఆవరణ, 5వ వార్డు శిశుమందిర్, తొమ్మిదో వార్డులోని ఉత్కూర్ చందారం రోడ్డులో, ఇటిక్యాల మినీట్యాంకు బండ్ వద్ద రూ.35 లక్షలతో ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేశారు. పర్యవేక్షణ లోపం కారణంగా జిమ్‌లో పరికరాలు చెడిపోవడంతో వ్యాయామం చేయడానికి ఇబ్బందులు పడుతున్నారు.

పలు వార్డుల్లో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌లకు యువత, వ్యాపారులు, ఉద్యోగులు వ్యాయామం చేస్తున్నారు. ఓపెన్ జిమ్ నిర్వహణలో అధికారులు నిర్లక్ష్యం వహించడంతో పరికరాలు చెడిపోయి సంవత్సరం గడుస్తున్నా మరమ్మతు చేపట్టడం లేదు. చందారం రోడ్డు సమీపంలో ప్రజలకు దూరం గా ఓపెన్ జిమ్ ఓపెన్ చేయడంతో నిరుపయోగంగా మారింది.

ప్రజలకు ఉపయోగపడని ప్రాంతాల్లో ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేశారని పట్టణ వాసులు ఆరోపిస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఓపెన్ జిమ్‌లు మరమ్మతుపై దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

● నిర్వహణ సక్రమంగా ఉండాలి

- చింత అశోక్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు



ఓపెన్ జిమ్‌ల నిర్వహణ సక్రమంగా ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. చెడిపోయిన పరికరాల మరమ్మతులు వెంటనే చేపట్టాలి. ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేసి తరచూ పర్యవేక్షించాలి.

● మరమ్మతు చేయిస్తాం

- మున్సిపల్ కమిషనర్ రాజశేఖర్



జూనియర్ కళాశాల మైదానంలోని ఓపెన్ జిమ్‌లో కొన్ని పరికరాలు చెడిపోయిన విషయం మా దృష్టికి వచ్చింది. వాటికి మరమ్మతుకు చర్యలు తీసుకుంటాం. మిగితా వార్డుల్లో ఓపెన్ జిమ్‌లు బాగానే ఉన్నాయి.

జిల్లాస్థాయిలో వెల్గనూర్ విద్యార్థి ప్రతిభ



అక్షయను అభినందిస్తున్న హెచ్‌ఎం

దండేపల్లి,జనవరి 4: వెల్గనూర్ జిల్లా పరిషత్ సెకండరీ ఉన్నత పాఠశాలకు చెందిన మ్యానె అక్షయ 9వతరగతి విద్యార్థి జిల్లాస్థాయి ప్రతిభా పాటవ పరీక్షలో ప్రతిభ కనబరిచారు. జిల్లా కేంద్రంలో గతనెల30న వినియోగదారుల హక్కులు-రక్షణ అనే అంశంపై పోటీలు నిర్వహించారు. పోటీలో అక్షయ25 మార్కులకు గాను 24మార్కులు సాధించి జిల్లా స్థాయిలో ప్రతిభకనబరిచారు. గురువారం ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మితో పాటు ఉపాధ్యాయుడు నర్సింహులు, ఉపాధ్యాయ బృందం అభినందించి బహుమతి ప్రదానం చేశారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరం



పరీక్షలు చేస్తున్న వైద్యులు

మంచిర్యాల కలెక్టరేట్, జనవరి 4: రేకుర్తి కంటి ఆస్పత్రి, గర్మిళ్ల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం జిల్లా కేంద్రం లో నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరానికి విశేషస్పందన లభించింది. నేత్ర వైద్యులు డాక్టర్ అభిషేక్, ప్రభాకర్ ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించి ఆపరేషన్ అవసరమైన వారికి రేకుర్తి ఆస్పత్రికి రిఫర్ చేశారు. 150మందికి వైద్యపరీక్షలు చేయగా, 60మందికి ఆపరేషన్ అవసరమని వైద్యులు గుర్తించారు. కంటికి సంబంధించిన సమస్యలుంటే తమను సంప్రదించాలని, మందులు ఉచితంగా అందిస్తామని లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు మోదుంపురం వెంకటేశ్వర్లు తెలిపారు. లయన్స్ క్లబ్ సభ్యులు సుగుణాకర్‌రెడ్డి, రాంచందర్, రమేష్‌బాబు, రాఘవేంద్రరావు, శంకర్ లింగం, అరవింద్‌వర్మ పాల్గొన్నారు.

ఒలింపియాడ్ పరీక్షలో చైతన్య విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

మంచిర్యాల కలెక్టరేట్, జనవరి 4 : నేషనల్ ఒలంపియాడ్-2023 నాలెడ్జ్ అస్సెస్‌మెంట్‌టెస్ట్‌లో మంచిర్యాలకు చెందిన శ్రీచైతన్య విద్యాసంస్థ విద్యార్థులు ప్రతిభ కనబర్చి రెండవ దశకు 21 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. 3వ తరగతి నుంచి 7వతరగతి వరకు మ్యాథ్స్, ఫిజిక్స్ కెమిస్ట్రీలో నిర్వహించిన పరీక్షకు విద్యార్థులు ఎంపికకావడంపై ప్రిన్సిపాల్ శ్యామలాదేవి అభినందించారు.

ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమేష్, ఇన్‌చార్జి ఆఫియా, కృష్ణవేణి, రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ



శ్రీకాంత్ కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

నెన్నెల, జనవరి 4: మండలంలోని కుశ్నపల్లిలో వివిధ కారణాలతో మృతి చెందిన వారి కుటుంబాలను ఎమ్మెల్యే గడ్డం వినోద్ గురువారం రాత్రి పరామర్శించారు. పుట్లసిరి చిన్నన్న, గంగిరెడ్డి శ్రీకాంత్ ఇటీవల మృతిచెందారు. వారి కుటుంబాలతో ఎమ్మెల్యే మాట్లాడారు. మృతిచెందిన వారికి సంతాపం ప్రకటించారు. ప్రభుత్వ సాయాన్ని సత్వరం అందేలా చూస్తానని హామీ ఇచ్చారు. ఆయనవెంట కాంగ్రెస్ నాయకులు నాతరి స్వామి, ఎంపీటీసీ బొమ్మెన హరీష్‌గౌడ్, నెన్నెల, కుశ్నపల్లి సర్పంచులు తోట సుజాతశ్రీనివాస్, సంధ్యామహేష్, తిరుపతిరెడ్డి, మధూకర్‌రెడ్డి ఉన్నారు.

పీఆర్‌టీయూ క్యాలెండర్ల విడుదల



క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న పీఆర్‌టీయూటీఎస్ నాయకులు

కోటపల్లి, జనవరి 4: కోటపల్లి జెడ్పీఎస్‌ఎస్, దేవులవాడ పాఠశాలల్లో గురువారం పీఆర్‌టీయూటీఎస్ క్యాలెండర్లను సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొట్టె శంకర్ విడుదల చేశారు. ప్రధానోపాధ్యాయులు కృష్ణమూర్తి, దామోదర్ రెడ్డి, పీఆర్‌టీయూ మండల ప్రధాన కార్యదర్శి కోమట్ల బాపు, అంజన్‌కుమార్, మూర్తి, కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్ఫూర్తి ప్రధాత సావిత్రిబాయి పూలే

దండేపల్లి, జనవరి 4: మొట్టమొదటి మహిళ ఉపాధ్యాయురాలు స్ఫూర్తి ప్రదాత సావిత్రి బాయి పూలే అని తాళ్లపేట స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు సుదర్శన్ అన్నారు. జాతీయ మహిళ ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకొని గురువారం తెలుగు విషయ సమాదాయ సమావేశంలో మహిళ ఉపాధ్యాయులను సన్మానించారు. ఆయన మాట్లాడుతూ పురుషాధిక్య సమాజానికి వ్యతిరేకంగా ఉద్యమించిన దేశ తొలితరం ఉద్యమకారిని సావిత్రిబాయి మహిళ లోకానికి ఆదర్శనీయమన్నారు. రిసోర్స్‌పర్సన్ జనార్దన్, ఉపాధ్యాయులు వసంత, మనోరమ, పద్మజ, నరేందర్, సీఆర్‌పి రాజ్‌మహ్మద్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అయ్యప్ప స్వాములకు భిక్ష



భిక్షలో పాల్గొన్న అయ్యప్ప మాలాధారణ స్వాములు

జన్నారం, జనవరి 4: రాంపూర్‌లో గురువారం మహ్మద్ నిజామోద్దీన్, మహిళ నాయకురాలు గీత ఆధ్వర్యంలో అయప్ప మాలాధారణ స్వాములకు భిక్ష నిర్వహించారు. అంతకుముందు అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. సర్వమతాలు సమానమేననే ఉద్దేశ్యంతో భిక్ష నిర్వహించినట్లు తెలిపారు. ఎంపీపీ గడ్డం శ్రీనివాస్, జెడ్పీటీసీ గడ్డం నాగరాణిత్రిమూర్తి తదితరులు పాల్గొన్నారు.

మాలలు ఐక్యంగా ఉద్యమించాలి

మంచిర్యాల కలెక్టరేట్, జనవరి 4: మాలలు ఐక్యంగా ఉద్యమించి సమస్యలు పరిష్కరించుకోవాలని మాల మహానాడు జాతీయ ఉపాధ్యక్షుడు తొగరి సుధాకర్ పేర్కొన్నారు. గురువారం జిల్లా అధ్యక్షుడు గజెల్లి లక్ష్మణ్ అధ్యక్షతన మహానాడు సమావేశం నిర్వహించగా సుధాకర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. హైదరాబాద్‌లో ఈ నెల 6న నిర్వహించే రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని, జిల్లా కేంద్రంతో పాటు మండల కేంద్రాల్లో మాల మహానాడు భవనాలు నిర్మించుకోవాలని, అన్ని కమిటీలు పూర్తి చేయాలని, ఎస్‌సి 59 కులాల ఐక్యత, వర్గీకరణకు వ్యతిరేకంగా పోరాడాలని ఆయన కోరారు. ఆసాది పురుషోత్తం, పాల్తెపు శంకర్, కనకరాజు, పుల్లయ్య, నర్సింగ్, వెంకటగిరి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి

మంచిర్యాల కలెక్టరేట్, జనవరి 4: జిల్లాలోని సంక్షేమ వసతి గృహాలలో పెండింగ్‌లో ఉన్న మెస్, కాస్మొటిక్ చార్జీల బిల్లులు విడుదల చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్ మోతీలాల్‌కు వినతిపత్రం అందజేశారు. ఎస్‌సి, ఎస్‌టి, బీసీ, మైనార్టీ సంక్షేమ హాస్టళ్లలో ఉంటున్న విద్యార్థులకు మెస్, కాస్మొటిక్ చార్జీలు పెండింగ్‌లో ఉన్నాయని, గురుకుల, కేజీబీవీ విద్యార్థులు ఇబ్బందుల పాలవుతున్నారని ఆయనకు తెలిపారు. సత్వరమే బిల్లులు విడుదల చేసి, వారికి న్యాయం చేయం చేయాలని కోరారు. నాయకులు అభినవ్, శ్రీనివాస్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఉత్పత్తుల పరిశీలన

మందమర్రిరూరల్, జనవరి 4: సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో తయారు చేసిన ఉత్పత్తులను గురువారం మందమర్రి మోడల్ స్కూల్ విద్యార్థులు పరిశీలించారు. ఎంబ్రాయిడరీ చేసే విధానం, చేతి సంచుల తయారీ గురించి శిక్షకురాలు వివరించారు. ప్రిన్సిపాల్ జయకృష్ణ, శిక్షకురాలు స్వప్న, ఉపాధ్యాయులు శ్రీకాంత్, కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.



ఉత్పత్తులను పరిశీలిస్తున్న విద్యార్థులు

ఆరు గ్యారంటీలతో అందరికీ లబ్ధి



ప్రజాపాలన సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గడ్డం వినోద్, దరఖాస్తులు పరిశీలిస్తున్న కలెక్టర్, నాగసముద్రంలో ప్రజలతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్, మద్దిమాడలో దరఖాస్తులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

బెల్లంపల్లి, జనవరి 4: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న ఆరు గ్యారంటీ పథకాలతో అందరికి లబ్ధి చేకూరుతుందని ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. గురువారం ఎఎంసీ క్రీడా మైదానంలో కల్యాణలక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కులను అందజేశారు. ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం గ్యారంటీ పథకాలను అమలు చేయదని బీఆర్ఎస్ నాయకులు తప్పుడు ప్రచారాలు చేస్తున్నారన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలందిస్తానన్నారు. ఇప్పటి వరకు 6.50 లక్షల మంది మహిళలు ఆర్టీసీ ఉచిత ప్రయాణాన్ని సద్వినియోగం చేసుకున్నారన్నారు. జడ్పీ వైస్‌చైర్మన్ సత్యనారాయణ, మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత, పట్టణాధ్యక్షుడు ముచ్చర్ల మల్లయ్య, రమేష్, రాంచం దర్, మహేందర్, నాతరి స్వామి, నర్సింగరావు, బండి ప్రభాకర్ పాల్గొన్నారు.

పట్టణంలోని ప్రజాపాలన వార్డు సభలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 6లోపు గ్యారంటీ పథకాల కోసం దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి కృషి చేస్తుందన్నారు. ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు.

నెన్నెల: సమస్యల పరిష్కారం కోసమే రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపాలన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నదని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. గుండ్లసోమారంలో నిర్వహించిన గ్రామసభను పరిశీలించారు. ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తుల వివరాలను తెలుసుకున్నారు. పేదలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూడాలని సూచించారు. గ్రామసభల్లో దరఖాస్తుదారులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. వయోవృద్ధులు, దివ్యాంగులు, మహిళల కోసం ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయాలన్నారు. దరఖాస్తుల స్వీకరణ అనంతరం వాటిని పరిశీలించి అర్హులైన లబ్ధిదారులకు అన్ని సంక్షేమ పథకాలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎంపీడీవో వరలక్ష్మి, జడ్పీటీసీ సింగతి శ్యామలారాంచందర్, సర్పంచ్ శంకర్, కొత్తూరులో నిర్వహించిన ప్రజాపాలన గ్రామ సభలో డిప్యూటీ కలెక్టర్ సిడాం దత్తు పాల్గొన్నారు. తహసిల్దార్ ఇమ్రాన్‌ఖాన్, ఎంపీవో శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ మేకల మల్లేష్, సర్పంచ్ మల్లయ్య ఉన్నారు.

దండేపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారంటీ పథకాలను ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన ద్వారా ప్రతీ పేదవాడికి లబ్ధి చేకూరుతుందని అదనపు కలెక్టర్ సభావత్ మోతీలాల్ అన్నారు. నాగసముద్రం, లక్ష్మికాంతపూర్, గూడెం, కన్నెపల్లి గ్రామాల్లో దరఖాస్తులు స్వీకరించారు. నాగసముద్రంలో మాట్లాడుతూ అర్హులైన వారందరు దరఖాస్తు చేసుకొని లబ్ధి పొందాలన్నారు. తహసీల్దార్ సంధ్యరాణి, ఎంపీడీవో మల్లేషం, సర్పంచులు అనవేని ప్రేమలతిరుపతి, బాదినేని సత్తమ్మనారాయణ, రజిని, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కాసిపేట: గ్యారంటీ పథకాలకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులు స్వీకరించాలని అదనపు కలెక్టర్ రాహుల్ అన్నారు. మద్దిమాడలో ప్రజాపాలన కార్యక్రమాన్ని సందర్శించారు. దరఖాస్తుదారులు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. దరఖాస్తు ఫారాలను ఉచితంగా అందిస్తామని, బయట కొనుగోలు చేయవద్దని, అనంతరం రికార్డులను పరిశీలించారు. మండల ప్రత్యేకాధికారి గంగారాం, ఎంపీడీవో ఆలీం, సూపర్‌వైజర్ రాధిక పాల్గొన్నారు.

వేమనపల్లి: చామనపల్లి గ్రామంలో ప్రజాపాలన గ్రామసభ నిర్వహించారు. ఎంపీడీవో లక్ష్మయ్య, ఎంపీవో బాపురావు, ఎంపీటీసీ సంతోష్‌కుమార్‌లు ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. కార్యదర్శి తోడె సంతోష్‌రెడ్డి,ఫీల్డ్ అసిస్టెంట్ రత్నం ప్రవీణ్, ఆశా కార్యకర్త సునీత, వీవోఏ పద్మ, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

చెన్నూరు: కాచన్‌పల్లి, అంగ్రాజ్‌పల్లి, సుందరసాల, వెంకంపేట గ్రామాల్లో ప్రజాపాలన గ్రామసభలను నిర్వహించారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగాన్ని వినిపించారు. ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీవో అజ్మత్‌అలీ, సర్పంచులు, కౌన్సిలర్లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

జన్నారం: బాదంపల్లి, లోతొర్రె, చింతలపల్లె, దేవునిగూడ గ్రామాల్లో తహసీల్దార్ వేణుగోపాల్, ఎంపీడీవో అరుణరాణిల ఆధ్వర్యంలో గ్రామసభలు నిర్వహించి దరఖాస్తులు స్వీకరించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముజాఫర్ ఆలీ , అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

'ప్రజాపాలన'లో అర్హులందరూ దరఖాస్తు చేసుకోవాలి

వాంకిడి, జనవరి 4: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా 6గ్యారంటీల అమలు కోసం నిర్వహిస్తున్న ప్రజాపాలన గ్రామసభల్లో అర్హులైన ప్రతిఒక్కరూ దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ రహీముద్దీన్, ఎంపీడీవో శివకుమార్ కోరారు. గురువారం మండలంలోని సరండి, పాటగూడ, లెండిగూడ, నవేగాం గ్రామాల్లో ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ నిర్వహించారు. కార్యక్రమంలో ఏవో మిలింద్‌కుమార్, ఏపీవో శ్రావణ్, ఏపీఎం మహేష్, డీఈ ఇర్షాన్, ఏఈ సౌమ్య, తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకున్న అనాథలైన పిల్లలు

సిర్పూర్(టి): మండల కేంద్రానికి చెందిన మహమ్మద్ యూసుఫ్, ఆసియాబేగం దంపతులకు ముగ్గురు సంతానం. ఇద్దరు కూతుర్లు, ఒక కుమారుడు ఉన్నారు. తల్లి ఆసియాబేగం ఏడు సంవత్సరాల క్రితం పాముకాటుతో మృతిచెందగా రెండు సంవత్సరాల క్రితం తండ్రి మహ్మద్ యూసుఫ్ అనారోగ్యంతో మృతిచెందడంతో పిల్లలు అనాథలుగా మారారు. పెద్ద కూతురు మహిన్ నిదా ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది. రెండో కూతురు నూరిబేగం 9వ తరగతి చదువుతోంది. కుమారుడు మహమ్మద్ ముస్తాఫా మదర్సాలో చదువుతున్నాడు. కాగా మండల కేంద్రంలో నిర్వహిస్తున్న ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణలో వారు గురువారం సంక్షేమ పథకాలకోసం తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీవో మహేంద రొరెడ్డి, ఈవో కృష్ణమూర్తి, ఆర్ఐ ముబీనుద్దీన్‌కు దరఖాస్తు అందజేశారు.

సిర్పూర్(యు): మండలంలోని ఆయాగ్రామ పంచాయతీల్లో గురువారం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న అభయహస్తం ఆరుగ్యారంటీల ప్రజాపాలన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయాగ్రామల ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు.

బెజ్జూరు: బెజ్జూరు గ్రామపంచాయతీలో గురువారం నిర్వహించిన ప్రజాపాలనలో అర్హులైన వారి నుంచి అధికారులు దరఖాస్తులను స్వీకరించారు. కాంగ్రెస్ నాయకులు ప్రజాపాలన గ్రామసభను సందర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అందరికీ సంక్షేమపథకాలు అందజేస్తుందని ప్రతిఒక్కరూ దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ పర్వీన్‌సుల్తానా, సర్పంచ్ అన్సార్ హుస్సేన్, ఉపసర్పంచ్ రాజేష్, కార్యదర్శి వైకుంఠం, శ్రీవర్ధన్, శంకర్, రాజారాం, హకీం, శైలేష్, వినోద్, విష్ణుమూర్తి, గంగారాం, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కెరమెరి: ప్రతిఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది ఎంపీడీవో మహేందర్ అన్నారు. గురువారం మండలంలోని పార్డి, మెట్టపిప్పిరి గ్రామాల్లో నిర్వహిం చిన ప్రజాపాలనలో ఆయన పాల్గొన్నారు. గ్రామాల్లో అర్హులైన వారందరూ దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో మల్లయ్య, కార్యదర్శి బొజ్జిరావు, సర్పంచ్ భీంరావు పాల్గొన్నారు.



సిర్పూర్(టి)లో దరఖాస్తు చేసుకుంటున్న పిల్లలు

గంజాయి నిర్మూలనకు స్పెషల్ డ్రైవ్

ఏసీసీ, జనవరి 4: రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మంచిర్యాల జిల్లాలో గంజాయి నిర్మూలనకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు డీసీపీ సుధీర్‌రాంనాథ్ కేకన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గంజాయి నిల్వ, సరఫరా, అమ్మకాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి ఎంతటి వారినైనా ఉపేక్షించబోమన్నారు. టాస్క్‌ఫోర్స్ పోలీసుల ఆధ్వర్యంలో విస్తృతంగా తనిఖీలు చేపట్టి గంజాయి సరఫరా, నిల్వ, అమ్మేవారిని పట్టుకుంటామన్నారు. గతంలో గంజాయి అక్రమ రవాణా విక్రయాలకు పాల్పడి జైలుకు వెళ్లి వచ్చిన వారు ప్రస్తుతం ఏం చేస్తున్నారో నిఘా పెట్టామన్నారు. గంజాయి వినియోగించే ప్రాంతాలు, అడ్డాలను గుర్తించి గంజాయి సేవించే వారికి కౌన్సెలింగ్ ఇచ్చి మాన్పించే ప్రయత్నం చేయనున్నట్లు తెలిపారు.

ప్రమాద బీమా చెక్కు అందజేత



బీమా చెక్కును అందజేస్తున్న బ్యాంకు సిబ్బంది

నస్పూర్, జనవరి 4: సీతారాంపల్లికి చెందిన సత్తన్న సిల్వేరు ఇటీవల ప్రమాదంలో మరణించగా ఆయన కుటుంబ సభ్యులకు ఎస్‌బీఐ జనరల్ ప్రమాద బీమా కింద మంజూరైన రూ.20 లక్షలను గురువారం తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్ కేవీ ప్రసాద్, రీజనల్ మేనేజర్ మురళిమనోహర్ చేతుల మీదుగా చెక్కును అందజేశారు. వారు మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు ప్రమాద బీమా చేయించుకోవాలని, ఎస్‌బీఐ జనరల్ రూ.1000 చెల్లించి తెలంగాణ గ్రామీణ బ్యాంకు ద్వారా రశీదు పొందాలని, ప్రమాదవశాత్తు మరణిస్తే నామినికి రూ.20 లక్షల బీమా వర్తిస్తుందన్నారు. బ్యాంకు మేనేజర్లు రాజేష్ ప్రసాద్, ప్రసన్నకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

అధికారులు వేధింపులు మానుకోవాలి



మాట్లాడుతున్న రైతు ప్రకాష్‌రెడ్డి

భీమారం, జనవరి 4: ఇరిగేషన్ అధికారులు వేధిస్తున్నారని మండల కేంద్రానికి చెందిన కట్కోజు ప్రకాష్‌రెడ్డి అనే రైతు పేర్కొన్నాడు. గురు వారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మండల కేంద్రంలోని ఊర చెరువును కబ్జాకు గురి చేసిన వారిపై చర్యలు తీసుకోకుండా తన పట్టా భూమిలో అధికారులు సర్వే చేస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని వాపోయాడు. ఊర చెరువును గ్రామానికి చెందిన కొందరు ఆక్రమించారని, గతంలో ఉన్న కలెక్టర్ భారతి హోళికేరి హద్దురాళ్లను వేయించారన్నారు. హద్దురాళ్లను గుర్తు తెలియని వ్యక్తులు తొలగించారన్నారు. ఇప్పుడు ఊర చెరువు భూమిలో కాకుండా పట్టా భూమిలో సర్వే చేస్తామని ఇరిగేషన్ అధికారులు ఇబ్బందులకు గురి చేస్తున్నారని, ఇది ఎంత వరకు న్యాయ మని ఆవేదన వ్యక్తం చేశాడు. వెంటనే ఉన్నతాధికారులు స్పందించి తనకు న్యాయం చేయాలని కోరాడు.

రైలు కింద పడి యువకుడి ఆత్మహత్య



వెంకటేష్ (ఫైల్)

బెల్లంపల్లి, జనవరి 4: పట్టణంలోని కన్నాల సమీపంలో గల రైల్వే ట్రాక్ పై గురువారం రైలు కింద పడి గద్దల వెంకటేష్ (30) అనే యువకుడు ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ లక్ష్మారెడ్డి తెలిపారు. ఇందిరానగర్‌కు చెందిన వెంకటేష్ తాపీ పని చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఇటీవల మద్యానికి బానిసయ్యాడు. రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న ట్లు తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

జైపూర్, జనవరి 4 : మంచిర్యాల పట్టణానికి చెందిన గంట నాగయ్య (33) కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. నాగయ్య ఈ నెల 1న ట్రాక్టర్‌లో శెట్‌పల్లి గ్రామానికి సిమెంటు బస్తాలు తీసుకువచ్చాడు. తిరిగి మంచిర్యాల వెళ్తుండగా ఇందారం ఎక్స్‌రోడ్డు వద్ద ఆర్టీసీ బస్సును ఓవర్‌టేక్ చేస్తుండగా బస్సును ఢీకొని ట్రాక్టర్ బోల్తా పడింది. దీంతో నాగయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌కు తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు ఎస్ఐ ఉపేందర్ తెలిపారు. మృతుడి కుమారుడు హరినారాయణ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సదరం శిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి

మంచిర్యాల కలెక్టరేట్, జనవరి 4: రెన్యూవల్, నూతన సదరం సర్టిఫికెట్లు పొందేందుకు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో ఈ నెల 9వ తేదీ నుంచి సదరం శిబిర నిర్వహిస్తున్నామని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి బి. శేషాద్రి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 9, 24వ తేదీల్లో శారీరక వికలాంగులు 100 మంది, 12, 22వ తేదీల్లో మూగ, చెవుడు 60 మంది, 19, 31 తేదీల్లో కంటి చూపు 100 మంది, 23, 30 తేదీల్లో మానసిక దివ్యాంగులు 100 మంది హాజరు కావాలని కోరారు. అర్హులు సద్వినియోగం చేసుకోవాలని, మీ సేవ ద్వారా స్లాట్ బుక్ చేసుకోవాలన్నారు.

గూడెం ఎత్తిపోతల ద్వారా యాసంగికి సాగు నీరు

రేపు నీటి విడుదల

దండేపల్లి, జనవరి 4: శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టుపై నిర్మించిన దండేపల్లి మండలం గూడెం సత్యనారాయణస్వామి ఎత్తిపోతల పథకం ద్వారా యాసంగి నీటిని ఈనెల 6న శనివారం ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు విడుదల చేయనున్నారు. తానిమడుగు 30వ డిస్ట్రిబ్యూటర్ నుంచి హాజీపూర్ మండలం 42వ డిస్ట్రిబ్యూటరీ వరకు మూడు మండలాల పరిధిలో నీరందించనున్నారు. 2 టీఎంసీల నీటిని 15032 ఎకరాలకు అందించనున్నట్లు నీటి పారుదల శాఖ అధికారులు వెల్లడించారు. ఎల్లంపల్లి ప్రాజెక్టులో నీటి మట్టం తక్కువగా ఉన్నందున నీటిని పొదుపుగా వాడకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ఆరుతడి పంటలు సాగు చేసుకోవాలని పేర్కొంటున్నారు. ప్రస్తుతం ఎల్లంపల్లి జలశయం 148 మీటర్ల పూర్తి సామర్థ్యానికి 145.98 మీటర్ల నీటి మట్టం ఉంది. ఈనెల 6 తేదీ నుంచి 90 రోజులపాటు సాగునీటి విడుదల చేసేందుకు అధికారులు సిద్ధం చేశారు. దండేపల్లి మండలానికి 5, 418, లక్షెట్టిపేట మండలానికి 7, 989 హాజీపూర్ మండలానికి 1625 ఎకరాలకు సాగు నీరు విడుదల చేయనునట్లు నీటి పారుదల శాఖ అధికారులు వెల్లడించారు.



గూడెం సత్యనారాయణ స్వామి ఎత్తిపోతల పథకం

అక్రమ నిర్మాణాల ఇంటి నంబర్లను రద్దు చేయాలి

తాండూర్, జనవరి 4: మాదారం పంచాయతీ పరిధిలోని పోచంపల్లిలో ఇటీవల కేటాయించిన ఇంటి నంబర్లను రద్దు చేయాలని గురువారం గ్రామస్తులు ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. సింగరేణి సంస్థ ద్వారా త్వరలో ఈ ప్రాంతాల్లో ఓపెన్‌కాస్టులు ఏర్పాటు అవుతుందనే విషయం దృష్టిలో పెట్టుకుని స్థానికులు కాని కొందరు నష్టపరిహారం పొందాలని ఇంటి నిర్మాణాలు చేపట్టారన్నారు. వాటికి పంచాయతీ నుంచి నంబర్లను తీసుకొన్నారని, నిర్మాణాలకు విద్యుత్ సరఫరా కోసం పనులు జరుగుతున్నాయని తెలిపారు. ఎన్నో ఏండ్లుగా నివసిస్తున్న తమకు ఇంటి నెంబర్లను కేటాయించలేదన్నారు. స్థానికేతర ఇంటి నెంబర్లను రద్దు చేయాలని, పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ఇసుక రీచ్ ఏర్పాటు చేయాలి

ఏసీసీ, జనవరి 4 : మంచిర్యాలలో ఇసుక రీచ్ ఏర్పాటు చేయాలని మైనింగ్ ఏడీ బాలుకు ట్రాక్టర్ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇసుక రీచ్ ఏర్పాటు చేయనందున ట్రాక్టర్ డ్రైవర్లు, వర్కర్లకు పని లేకుండా పోయిందన్నారు. వెంటనే అధికారులు స్పందించి ఇసుక రీచ్ ఏర్పాటు చేసి ఉపాధి కల్పించాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బోరిగం వెంకటస్వామి, హన్మంతు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వామి నరేంద్ర ఆచార్య పాదుక దర్శనం

- మండల కేంద్రంలో భారీ ర్యాలీ
- రెండు రాష్ట్రాల నుంచి తరలివచ్చిన ప్రముఖులు



కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

కౌటాల, జనవరి 4: మండల కేంద్రంలోని మినీ స్టేడయంలో గురువారం స్వామి నరేంద్ర ఆచార్య పాదుక దర్శన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ముందుగా రామాలయం నుంచి మినీస్టేడియం వరకు భారీర్యాలీ నిర్వహించారు. తెలంగాణ, మహారాష్ట్రలకు అనుసంధానంగా ఉన్న ప్రాణహిత, వార్ధా నది తీరాల్లో పల్లె ప్రజలు ఆరాధించే ప్రముఖ ఆధ్యాత్మిక గురువు నరేంద్ర ఆచార్య మహారాజ్. ఆయన పాదుక దర్శనానికి మినీస్టేడియం భక్తులతో నిండింది. ఆధ్యాత్మికతోపాటు చెడుఅలవాట్లు, వ్యసనాలను దూరం చేయడంలో స్వామిజీ కీలక భూమికి పోషిస్తున్నారు. మహారాష్ట్రలోని నానిజ్‌ధాం నుంచి వచ్చిన పాదుకలకు ప్రత్యేకపూజలు నిర్వహించారు. ప్రతి సంవత్సరం లక్ష యూనిట్ల రక్తం సేకరించి 50వేలు మిలటరీకి మరో 50వేలు ప్రభుత్వానికి అందిస్తామని తెలిపారు. అదే విధంగా వందల సంఖ్యలో అంబులెన్స్ సేవా కార్యక్రమం, పేదలకు కుట్టుమిషన్లు, స్ప్రే పంపులు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే హరీష్‌బాబు పాదుక పూజ నిర్వహించారు. తెలంగాణ, మహారాష్ట్ర నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

షాట్ పుట్‌లో ఆదివాసీ విద్యార్థినికి గోల్డ్‌మెడల్



గిరిజన సంక్షేమ శాఖ అధికారులతో విద్యార్థిని అనిత

జైనూర్, జనవరి4: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆశ్రమోన్నత పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న విద్యార్థిని మడావి అనిత ఖమ్మంలో నిర్వహిస్తున్న గిరిజన సంక్షేమశాఖ షాట్ పుట్ క్రీడలో గురువారం రాష్ట్ర స్థాయిలో గోల్డ్ మెడల్ సాధించింది. తమ పాఠశాల విద్యార్థిని గోల్డ్ మెడల్ సాధించడం ఎంతో గర్వంగా ఉందని హెచ్ఎం మండాడి సోనేరావ్ పేర్కొన్నారు. అదేవిధంగా జైనూరు బాలిక ఆశ్రమోన్నత పాఠశాలను ప్యానెల్ టీం బృందం తనిఖీ చేసింది. పాఠశాలలో తరగతి గదులు, వంట గదిని వారు పరిశీలించారు. మడావి అనిత షాట్‌పుట్‌లో గోల్డ్‌మెడల్ సాధించడం ఎంతో గర్వించదగ్గ విషయమన్నారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం మండాడి సోనేరావ్‌ను పుష్పగుచ్ఛంతో ప్యానెల్ అధికా రులు అభినందించారు.

రక్తహీనతపై అవగాహన కలిగి ఉండాలి

- డీఎంహెచ్‌వో తుకారాంభట్



వైద్యశిబిరంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో తుకారాంభట్

సిర్పూర్(టి), జనవరి 4: సికిల్ సెల్, అనీమియా వ్యాధులపట్ల జాగ్రత్త వహించాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ తుకారాంభట్ అన్నారు. గురువారం మండలంలోని కోలాంగూడ గ్రామంలో కోలాం గిరిజనులతో సమావేశం నిర్వహించారు. గిరిజనుల్లో చాలామంది రక్తహీనతతో బాధపడుతుంటారని దీంతో పిల్లల్లో కూడా వ్యాధి అభివృద్ధి చెందుతుందన్నారు. పౌష్టిక ఆహారం, మాంసం ఎక్కువగా తీసుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వం గిరిజనుల కోసం పీఎంజన్‌ధన్ పథకం ప్రవేశపెట్టిందన్నారు. అనంతరం 150మంది గిరిజనుల నుంచి రక్తనమూనాలు సేకరించారు. కార్యక్రమంలో డాక్టర్ నవత, ఆరోగ్య సిబ్బంది శామ్యూల్, సునీత, పద్మావతి, లలిత, నర్సయ్య, రాజలింగు, నాజీయా తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



మాట్లాడుతున్న ఇన్‌చార్జీ డీఈవో ఉదయ్ బాబు

కాగజ్‌నగర్, జనవరి 4: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని ఇన్‌చార్జీ డీఈవో ఉదయ్‌బాబు అన్నారు. గురువారం కాగజ్‌నగర్‌లో ఏర్పాటు చేసిన సుస్థిర జీవన విధానంపై ఏర్పాటు చేసిన సెమినార్‌లో ఆయన మాట్లాడారు. ప్లాస్టిక్ వినియోగంతో క్యాన్సర్ వ్యాధులు వస్తున్నాయన్నారు. ప్లాస్టిక్‌వాడకం తగ్గించాలన్నారు. జిల్లాసైన్స్ అధికారి మధూకర్ మాట్లాడుతూ ప్లాస్టిక్ తయారు చేసే ఫ్యాక్టరీల్లో వెలువడే కాలుష్యాలతో క్యాన్సర్ వ్యాధులు వస్తున్నట్టు తేలిందన్నారు. అలాగే ప్లాస్టిక్‌లో వేడిపదార్థాలు తినటం వలన జీర్ణకోశ వ్యాధులు అధికంగా వచ్చి క్యాన్సర్‌కు దారి తీస్తున్నాయన్నారు. ఈ సెమినార్‌లో జాతీయహరితదళ ప్రాజెక్టు అధికారి విద్యాసాగర్‌రావు, మేనేజర్ శివకుమార్ రిసోర్స్‌పర్సన్ వివిధ అంశాలపై అవగాహణ కల్పించారు. కార్యక్రమంలో మండలనోడల్‌అధికారి దేవాజీ స్కూల్ కాంప్లెక్సు ప్రధానోపాధ్యాయురాలు ప్రమీల, విద్యార్థులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో ఎమ్మార్సీ భవనం

- దివ్యాంగుల పాఠశాలలో సామగ్రి, కంప్యూటర్లు
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు



శిథిలావస్థలో ఉన్న ఎమ్మార్సీ భవనం

సిర్పూర్(టి), జనవరి 4: మండలకేంద్రంలోని ఎమ్మార్సీ భవనం శిథిలావస్థకు చేరుకుంది. భవనం పది సంవత్సరాల నుంచి మూతపడి ఉంది. దీంతో ఎమ్మార్సీ కార్యాలయాన్ని అధికారులు దివ్యాంగుల పాఠశాలలో కొనసాగిస్తున్నారు. ప్రభుత్వం మండలంలోని ఎమ్మార్సీకి కొత్త భవనం మంజూరు చేయక పోవడంతో సీఆర్పీలు, ఎమ్మార్సీ సిబ్బంది ఒకే గదిలో విధులు నిర్వహిస్తూ తీవ్రఇబ్బందులు పడుతున్నారు. విద్యార్థుల వివరాల నమోదు, పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు, టీచర్ల వేతనాల బిల్లులు, మధ్యాహ్న భోజన రికార్డుల తయారు, బ్రేక్‌ఫాస్ట్ వివరాలు తయారు చేయడానికి సీఆర్పీలు తీవ్ర ఇబ్బందులు గురవవుతున్నారు. ఎమ్మార్సీకి ఆరు కంప్యూటర్లను ప్రభుత్వం మంజూరు చేసింది. అయితే భవనం లేక పోవడంతో వాటిని అధికారులు దివ్యాంగుల పాఠశాలలోనే ఏర్పాటు చేస్తున్నారు. దీంతో దివ్యాంగ విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు ఎమ్మార్సీ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని, లేనిపక్షంలో దివ్యాంగుల పాఠశాలలో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందని సిబ్బంది పేర్కొంటున్నారు.



దివ్యాంగుల పాఠశాలలో ఉంచిన కంప్యూటర్ సామగ్రి

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



అయోధ్య శ్రీరామ అక్షింతల పంపిణీ

ఆసిఫాబాద్, జనవరి 4: అయోధ్యలో ఈనెల22న శ్రీసీతారాముల ఆలయం ప్రారంభోత్సవం సందర్భంగా అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలను గురువారం కోదండ రామాలయం కమిటీ ఆధ్వర్యంలో జన్కాపూర్‌లో ఇంటింటికి పంపిణీ చేశారు. రామమందిర ప్రారంభో త్సవానికి సంబంధించిన వివరాలను వెల్లడించారు. అక్షింతల విశిష్టతను వాడుకునే విధానాన్ని ఆలయ అర్చకుడు వినాయక్ తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు సత్యనారాయణ, సభ్యులు శంకరయ్య, తిరుపతి, శ్రీహరి, లక్ష్మి పాల్గొన్నారు.

జన్‌మన్ పథకం ద్వారా గిరిజనుల అభివృద్ధికి కృషి

● కలెక్టర్ హేమంత్ బోర్కడే



సమావేశంలో మట్లాడుతున్న కలెక్టర్ హేమంత్ బోర్కడే

ఆసిఫాబాద్, జనవరి 4: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి జన్‌మన్ పథకం ద్వారా పీటీజీ గిరిజనుల అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హేమంత్ బోర్కడే అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ దీపక్ తివారి, వేణుతో కలిసి తహసీల్దార్, వైద్యఆరోగ్యశాఖ, బ్యాకింగ్, ఎంపీడీవోలు, ఇతర శాఖల అధికారులతో జన్‌మన్‌పథకం కింద ఆదివాసీ ఈటీజీ గిరిజనుల అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రధాన మంత్రి జన్‌మన్ పథక విజయవంతం చేయడం కోసం సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో కృషిచేయాలన్నారు. జిల్లాలోని ప్రతి పీటీజీ గిరిజన కుటుంబంలో అందరికీ ఆధార్‌కార్డు, పక్కా ఇళ్లు, ప్రతిఇంటికి నల్లా, విద్యుత్‌కనెక్షన్, ప్రతి గిరిజన గ్రామానికి రహదారి సౌకర్యం, విద్య శిక్షణకై వసతిగృహాలతో పాటు సుదూర ప్రాంతాలకు సంచార వైద్యసదుపాయం, అందరికీ పోషకాహారం ఇతర అన్ని సౌకర్యాలను అందించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. గిరిజనుల ఉన్నత జీవనసౌకర్యం, ప్రతి గ్రామానికి ఫోను సౌకర్యం కల్పించాలన్నారు. మల్టీపర్పస్ సెంటర్ ఏర్పాటుకు చర్యలు చేపట్టాలన్నారు. భారత గిరిజన మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి జన్‌మన్ పథకం నిర్వహణకు సంబంధిత శాఖల అధికారులు సమష్టిగా కృషిచేయాలని తెలిపారు. సమావేశంలో గిరిజనాభివృద్ధి అధికారి రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

జన్‌మన్ కోసం ఆధార్ అప్‌డేట్ చేసుకోవాలి

● అదనపు కలెక్టర్ దీపక్ తివారి



ఆధార్ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

ఆసిఫాబాద్, జనవరి 4: ప్రధానమంత్రి జన్‌మన్ కొరకు అర్హులైన వారంతా తమ ఆధార్‌కార్డు వివరాలను అప్‌డేట్ చేసుకోవాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. గురువారం జిల్లాలోని చిర్రకుంట గ్రామంలో ఆధార్‌నమోదు కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం చేపట్టిన ప్రధాన మంత్రి జన్‌మన్ పథకంలో భాగంగా దరఖాస్తు చేసుకునే అర్హులైన వారంతా ఆధార్ కార్డులో తమ వివరాలను అప్‌డేట్ చేసుకోవాలన్నారు. ఇందుకోసం ఆధార్ నమోదు కేంద్రాలలో అవస రమైన ఏర్పాట్లు చేశామన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పూర్తి స్థాయి సౌకర్యాలు కల్పిస్తామన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు గిరిజన పాఠశాల విద్యార్థులు



ఉపాధ్యాయులతో జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

ఆసిఫాబాద్ రూరల్, జనవవరి 4: జాతీయస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఆసిఫాబాద్ గిరిజన గురుకుల పాఠశాల విద్యార్థులు అర్చి, కౌలస్య ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ అనిత, వైస్‌ప్రిన్సిపాల్ భద్రకాళి తెలిపారు. వీరు గతనెల 17నుంచి 19వరకు వనపర్తిలో జరిగిన రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో ఉత్తమ ప్రతిభకనబర్చి జాతీయ స్థాయికి ఎంపియ్యారని అన్నారు. ఈనెల 17నుంచి 31వరకు సెంట్రల్‌లో జరిగే స్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు.

250 మందికి ఉచిత కంటి ఆపరేషన్లు



కంటి ఆపరేషన్ చేయించుకున్న వృద్ధులతో నిర్వాహకులు

కౌటాల, జనవవరి 4: గతనెల 26న కాగజ్‌నగర్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించి కంటి లోపంతో బాధపడుతున్న కౌటాల, చింతలమానేపల్లి, బెజ్జూరు మండలాలకు చెందిన 250మందికి బెల్లంపల్లి జాస్వీ విజన్ కేర్ ఆసుపత్రిలో జేఆర్ సర్కార్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత కంటి ఆపరేషన్‌లు చేశామని ట్రస్ట్ చైర్మన్ నారాయణ్ సర్కార్, డాక్టర్ సీమ సర్కార్ తెలిపారు.

అనుమతులు లభించేనా?



లో లెవల్ వంతెన పై నుంచి ప్రవహిస్తున్న దిండా వాగు (ఫైల్)

- అటవీశాఖ అనుమతుల్లేక ఏళ్లుగా నిలిచిన అభివృద్ధి పనులు
- అభివృద్ధికి దూరంగా పల్లెలు
- కొత్త ప్రభుత్వంపైనే కోటి ఆశలు
- ప్రభుత్వం దృష్టి సారిస్తేనే సమస్యలు పరిష్కారం

చింతలమానేపల్లి, జనవరి 4: అటవీ అనుమతులు లేక జిల్లాలోని చాలాచోట్ల అభివృద్ధి పనులు ముందుకు సాగడం లేదు. ప్రధానంగా రోడ్లు, వంతెన నిర్మాణం అత్య వసరం ఉన్నా అటవీ అనుమతులు లభించడంలో ఆలస్య మవుతుండడంతో ఆయా గ్రామాలకు చెందిన ప్రజలు అనేక అవస్థలు పడాల్సి వస్తోంది. ఇటీవల కొత్త ప్రభుత్వం ఏర్పాటైన నేపథ్యంలో ప్రభుత్వంపై కోటి ఆశలతో ప్రజలు ఎదురుచూస్తున్నారు. త్వరగా అటవీ అనుమతులు తీసుకు వచ్చి అభివృద్ధి పనులు ముందుకు తీసుకుపోతారన్న ఆశతో ఎదురు చూస్తున్నారు.

● జిల్లాలో ఇదీ పరిస్థితి..

జిల్లాలోని 15మండలాల పరిధిలో 335 జీపీలుండగా, వాటికి అనుబంధంగా అనేక గ్రామాలు ఉన్నాయి. గతంలో ప్రభుత్వం ఆయాగ్రామాలకు కనీససౌకర్యాలు కల్పించ డంలో భాగంగా రోడ్లు, వంతెనలు మంజూరు చేసింది. అయితే అటవీ శాఖ అనుమతులు లభించకపోవడంతో చాలా వరకు ప్రారంభం కాలేదు. గ్రామాల నుంచి మండల కేంద్రాలు, జిల్లా కేంద్రాలకు చేరుకునేందుకు ప్రజలు అవస్థలు పడుతున్నారు. కొన్నిచోట్ల అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్ కూడా వెళ్లని దుస్థితి ఇప్పటికీ నెలకొంది. ఇందులో ప్రధానంగా..

- సిర్పూర్ నియోజకవర్గంలోని చింతలమానేపల్లి మండలం దిండా-కేతిని గ్రామాల మధ్య ఉన్న వాగు ఉధృతంగా ప్రవహిస్తుంటుంది. దీనిపై లోలెవల్ వంతెన ఉన్నప్పటికీ వాగు ఉధృతి ఉన్నప్పుడల్లా దిండా గ్రామస్తు లకు రోజుల తరబడి రాకపోకలకు నిలిచిపోతాయి. గ్రామంలో అత్యవసర పరిస్థితులు ఉన్నప్పుడు దేవుడి మీదనే భారం వేసుకొని ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. ఇక్కడ వంతెన నిర్మాణానికి 3కోట్ల నిధులు మంజూరైనా పనులు ప్రారంభం కాలేదు.
- పెంచికలపేట మండలం అగర్‌గూడ-కమ్మర్‌గాం, అగర్‌గూడ-బెజ్జూర్ మండలంలోని హేటిగూడ వరకు రోడ్డు నిర్మాణానికి 4ఏళ్ల క్రితం 3కోట్ల నిధులు మంజూరైనా పనులు పారంభం కాలేదు.
- బెజ్జూర్ మండలంలో రోడ్డు, వంతెన నిర్మాణానికి 2018లో కోట్లు మంజూరయ్యాయి. బెజ్జూరు-సోమిని, సోమిని నుంచి గూడెం వరకు అభివృద్ధి పనులు జరగాల్సి ఉన్నది. అటవీ అనుమతుల ఆలస్యం వల్లనే పనులు ప్రారంభం కాలేదు.
- సిర్పూర్(టి) మండల కేంద్రం నుంచి మాలిని వరకు రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. పనులు మాత్రం సాగడం లేదు.
- దహెగాం మండలం ఖర్జి, రాంపూర్, అలాగే కొంచవెల్లి-కల్వాడ వరకు రహదారుల అభివృద్ధికి నిధులు మంజూరైనా పనులు సాగడం లేదు.
- కౌటాల మండలం శీర్షా- కనికి వరకు రోడ్డు కోసం నిధులు మంజూరైనా అటవీ అనుమతులు లేక పనులు ముందుకు సాగడం లేదు.
- అలాగే ఆసిఫాబాద్ నియోజకవర్గంలోని జైనూర్ మండలం డబోలి, జాడగూడ, లొద్దిగూడ వరకు రోడ్డు మంజూరైనా అటవీఅనుమతులు లేక పనులు నిలిచిపో యాయి.
- వాంకిడి మండలం ఖమాన-సర్కెపల్లి వరకు 7కోట్లు మంజూరయ్యాయి. 6కి.మీ రోడ్డు పూర్తి కాగా మరో 3కి.మీ రోడ్డు కావాల్సి ఉన్నది. అటవీ అనుమతులు లభించక పోవడంతో పనులు ఆగిపోయాయి. దీంతో ప్రజలు రాక పోకలకు ఇబ్బందులు పడుతున్నారు.

● కొత్త ప్రభుత్వంపైనే ఆశలు..

ఇన్నాళ్లు కనీస సౌకర్యాలకు నోచుకోని ఆయా గ్రామాల ప్రజలు కొత్తగా ఏర్పడ్డ ప్రభుత్వంపైనే కోటి ఆశలు పెట్టు కున్నారు. కనీస సౌకర్యాలైన రోడ్లు, వంతెన నిర్మాణాల కోసం అటవీ అనుమతులు తీసుకువచ్చి అభివృద్ధి పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. దీంతో విద్యార్థులకు, ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా ఉంటుందని పలు గ్రామాలకు చెందిన ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తు న్నారు.

దిండా వంతెన నిర్మించాలి..

- డోకె రామన్న, దిండా గ్రామస్థుడు



చింతలమానేపల్లి మండలం దిండా-కేతిని వాగుపై హైలెవల్ వంతెన నిర్మించాలి. వంతెన నిర్మాణానికి రూ.3 కోట్ల నిధులు మంజూరు అయినట్లు అధికారులు చెబు తున్నా అటవీ అనుమతులు లేక పోవడంతో పనుల్లో కదిలిక లేదు. కొత్తగా ఏర్పడ్డ ప్రభుత్వ పాలకులు స్పందిం చి వంతెన నిర్మాణానికి కృషిచేయాలి. మా గ్రామస్థుల కష్టాలు తీర్చాలి.

ప్రాణహిత ప్రాజెక్టును పూర్తి చేస్తాం

● ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు



కౌటాలలో దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు

కౌటాల, జనవవరి 4: ప్రాణహిత ప్రాజెక్టును పూర్తి చేస్తామని ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని రైతు వేదికలో ఏర్పాటుచేసిన ప్రజాపాలన సదస్సులో ఆయన పాల్గొని ప్రసంగిం చారు. ప్రాణహిత ప్రాజెక్టు పూర్తిచేసి తూర్పు ఆదిలాబాద్ జిల్లాలోని బీడు భూములకు సాగునీరందించేందుకు కృషి చేస్తామన్నారు. ప్రభుత్వం కూడా ఈదిశగా ఆలో చిస్తుందని తెలిపారు. మారుమూల ప్రాంతాల అభివృద్ధి కోసం ప్రత్యేక చొరవ తీసుకుంటామని ప్రతి సమస్యపై అసెంబ్లీలో చర్చించి సమస్యలకు పరిష్కారం కనుగొంటామని హామీ ఇచ్చారు. అనంతరం ఆర్ఎంపీ, పీఎంపీలు ఎమ్మెల్యే హరీష్ బాబును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీమంత్రి అమర్‌సింగ్ తిలావత్, రాజేందర్, వానుపటేల్, తహసీల్దార్ శ్రీపాల్‌రెడ్డి, ఎంపీడీవో నస్రుల్లా పాల్గొన్నారు.

మండలాభివృద్ధికి కృషి చేస్తా

దహెగాం: మండలాభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు అన్నారు. గురువారం మండలం కేంద్రంలోని రైతువేదికలో 108 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మీ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంతర్గతరోడ్లు, ఖర్జీ-మొట్లగూడ గ్రామానికి బీటీ రోడ్డు, పీపీరావు ప్రాజెక్టు కాలువల మరమ్మతులు, పూడికతీత తదితర పనులు చేపడుతామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సులోచన, సంతోష్‌గౌడ్, వైస్‌ఎంపీపీ సురేష్, ఎంపీటీసీ జయలక్ష్మి, ఎమ్మార్వో కవిత, డీటీ లలిత, ఎంపీటీసీలు, నాయకులు ధనుంజయ్, దామోదర్,నాందేవ్,శృతి పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన విశ్రాంత ఉద్యోగసంఘం సభ్యులు

కాగజ్‌నగర్: ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబును గురువారం విశ్రాంత ఉద్యోగుల సంఘం సభ్యులు కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఆయా సమస్యలను దశల వారీగా పరిష్కరిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో అధ్యక్షుడు అబ్రహం, కార్యదర్శి శివప్రసాద్, ఏఎస్ఆర్ మూర్తి, నర్సయ్య, ఎం సుభాష్, పురుషోత్తం, ముబషీర్‌హుస్సేన్ పాల్గొన్నారు.

హైమన్‌డార్ఫ్ దంపతుల వర్ధంతి కరపత్రాలు విడుదల

జైనూర్, జనవరి 4: మండలంలోని మార్లవాయి ఆదివాసులు, గ్రామసర్పంచ్ కనకప్రతిభ తదితరులు గురువారం డిప్యూటీసీఎం భట్టి విక్రమార్క, స్త్రీశిశు, పంచాయతీరాజ్‌మంత్రి సీతక్కను హైదరాబాదులో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఈ నెల11న మానవ పరిణామ శాస్త్రవేత్త ప్రొఫెసర్ హైమన్‌డార్ఫ్, ఆయన సతిమణి జెట్టి ఎలిజిబెత్‌ల వర్ధంతిని అధికారికంగా నిర్వహించేందుకు చర్యలు చేపట్టాలని వారిని కోరారు. అనంతరం డార్ఫ్ దంపతుల వర్ధంతి కరపత్రాలను డిప్యూటీ సీఎం, మంత్రి సీతక్క విడుదల చేశారు. కార్యక్రమంలో సార్మేడి జుగునాక దేవరావ్, సర్పంచ్ కనక ప్రతిభ, డార్ఫ్ యువజన సంఘం అధ్యక్షుడు కనక వెంకటేశ్వర్‌రావ్, ఉపసర్పంచ్ జుగునాక సావిత్రి, ఆదివాసులు గణపత్, మాజీసర్పంచ్ కనక కొద్దు పాల్గొన్నారు.

పులి సంచారంపై పుకార్లు

కౌటాల, జనవవరి 4: మండలంలోని చీపురుదుబ్బ గ్రామశివారులో గురువారం ఉదయం పెద్దపులి సంచరిస్తోందని గ్రామశివారులోని రైతులు, కూలీలు ప్రచారం చేశారు. ఉదయం పత్తి తీయడానికి వెళ్లినప్పుడు పులి కనిపించిందని వెంటనే తామంతా ఇళ్లకు వచ్చామని గ్రామస్థులు తెలిపారు. దీంతో విషయం తెలుసుకున్న ఎఫ్‌బీవో ఆలం ప్రభాకర్ గ్రామస్థులు ఇచ్చిన సమాచారం మేరకు పులి సంచరించిన ప్రాంతాల్లో పాద ముద్రలను గుర్తించేందుకు వెళ్లగా అక్కడ ఎలాంటి పులి అడుగులు లేవని ఆయన తెలిపారు. రైతులు, కూలీలు భయ పడాల్సిన అవసరం లేదని ఆయన తెలిపారు. అనవసరంగా ఇలా పులులు సంచరిస్తున్నట్లు పుకార్లు లేపకూడదన్నారు. పులి కనిపించినట్లయితే వెంటనే తమకు తెలియజేయాలని సూచించారు.

పోగొట్టుకున్న మొబైల్ ఫోన్ అందజేత

వాంకిడి, జనవరి 4: పోగొట్టుకున్న మొబైల్ ఫోన్‌ను గురువారం సీఈఐఆర్ టెక్నాలజీ ద్వారా వాంకిడి పోలీసులు స్వాధీనపరుచుకుని బాధితుడికి అందజేశారు. మండలంలోని ఖమాన గ్రామానికి చెందిన బిల్ల తిరుపతి రూ.10,500 విలువచేసే ఫోన్ ఆరునెలల క్రితం పోగొట్టుకుని పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో ఎస్సై సాగర్ ఫోన్‌ను స్వాధీనపర్చుకుని బాధితుడికి అప్పగించినట్లు తెలిపారు.

9నుంచి సదరం శిబిరాలు

ఆసిఫాబాద్, జనవరి 4: ఈనెల 9నుంచి ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో దివ్యాంగుల సౌకర్యార్థం సదరమ్ శిబిరం నిర్వహిస్తున్నట్లు డీఆర్డీవో సురేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 9న మూగ, చెవిటి దివ్యాంగులకు, 18నఅంధులకు, 23న మానసిక వైకల్యం కలిగిన వారికి, 30న ఎముకలకు సంబంధించిన దివ్యాంగులకు సదరమ్‌శిబిరం నిర్వహిస్తామని దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రెగ్యులర్ జిల్లా విద్యాధికారిని నియమించాలి

ఆసిఫాబాద్ రూరల్, జనవరి 4: జిల్లాకు రెగ్యులర్ జిల్లా విద్యాశాఖాధికారిని నియమించాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు టీకానంద్ కోరారు. గురువారం జిల్లాకేంద్రంలోని సంఘ కార్యాల యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొన్నిరోజులుగా రెగ్యులర్ విద్యాశాఖాధికారి లేక పోవడంతో విద్యావ్యవస్థ కుంటుపడిందన్నారు. గతంలో జిల్లాలో పని చేసిన విద్యాశాఖాధికారి బదిలీపై వెళ్లడంతో పోస్టు ఖాళీ అయిందని వెంటనే జిల్లా విద్యాధికారిని నియమించాలని కోరారు.

రుద్రకసలో కేంద్ర సంక్షేమ పథకాలపై సర్వే

సిర్పూర్(యు), జనవరి 4: మండలంలోని బాండేయర్ గ్రామ పంచాయతీ పరిధిలో గల రుద్రకస(కోలంగూడ)లో గురువారం కేంద్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలపై అధికారులు ఇంటింటికి తిరిగి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా మహగాం స్కూల్ కాంప్లెక్స్ ఎస్‌సీఆర్పీ సిర్మేల మారుతి మాట్లాడుతూ ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి చాహత్ బాజ్‌పాయ్ ఆదేశాలతో పీవీటీజీ గ్రామాల్లో వివిధ అంశాలపై సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పీఎంజేఏవై, ఆయుష్మాన్ భారత్, కిసాన్ క్రెడిట్ కార్డు, కిసాన్ సమ్మాన్ నిధి క్రెడిట్ కార్డు, ఎఫ్ఆర్‌వో పట్టాలింక్, ఆధార్ కార్డు,రేషన్ కార్డు, ఓటర్ కార్డు తదితర అంశాలపై ఇంటింటికి తిరిగి వివరాలు సేకరించినట్లు తెలిపారు. సర్వే వివరాలను ఐటీడీఏ కార్యాలయంలో సమర్పిస్తామన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి



గిరిజన సంక్షేమాధికారి రమాదేవికి వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

ఆసిఫాబాద్ రూరల్, జనవరి 4: గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో పని చేస్తున్న డైలీవేజ్ వర్కర్లందరినీ పర్మినెంట్ చేయాలని సీఐటీయూ నాయకుడు కృష్ణమాచారి డిమాండ్ చేశారు. అదేవిధంగా వారికి రావాల్సిన ఏడు నెలల వేతనాలను చెల్లించాలన్నారు. ఈ సంద ర్భంగా యూనియన్ రాష్ట్రఅధ్యక్షుడు ప్రభాకర్ ఆధ్వర్యంలో కలెక్టర్ హేమంత్ బొర్కడే, గిరిజన సంక్షేమశాఖాధికారి రమాదేవికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు శ్యాంరావు, కోటయ్య, రాంబాబు, బాలకిషన్, సంతర్‌బాయి, పతుబాయి పాల్గొన్నారు.



ఎస్ఎల్‌పి పదోన్నతులు వెంటనే కల్పించాలి

శ్రీరాంపూర్, జనవరి 4: ఒప్పందం ప్రకారం ఒకే కేటగిరిలో అండర్‌గ్రౌండ్ కార్మికులు ఏడేళ్ల పనిచేస్తే ఎస్ఎల్‌పి పదోనతులు కల్పించాలని ఏఐటీయూసీ ఉప ప్రధానకార్యదర్శులు కె వీరభద్రయ్య, ముష్కె సమ్మయ్య, బ్రాంచి కార్యదర్శి ఎస్‌కె బాజీసైదా, ఉపాధ్యక్షుడు కొట్టె కిషన్ రావు ఒక ప్రకటనలో కోరారు. ప్రతి ఏడాది ఒకటో తేదీన లెటర్లు ఇవ్వాలని, కానీ ఈ ఏడాది ఇంకా ఇవ్వలేదన్నారు. లేఖలు ఇవ్వకపోవడంతో కార్మికులకు అన్యాయం జరుగుతోందన్నారు. వారంలోగా లెటర్లు ఇవ్వాలని వారు యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు.

'కార్మికుల నమ్మకాన్ని వమ్ము చేయం'

మందమర్రి టౌన్, జనవరి 4: సింగరేణి కార్మికులు తమపై నమ్మకంతో గుర్తింపు సంఘంగా ఎన్నుకున్నారని, వారి నమ్మకాన్ని వమ్ము చేయకుడా పనిచేస్తామని కేకే5 గనిపిట్ కార్యదర్శి గాండ్ల సంపత్ అన్నారు. గురువారం ఆయన గనిపై కార్మికులను కలిసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో గుర్తింపు సంఘం విధానాలు, ఒంటెద్దు పోకడలతోనే తమను ఎన్నుకున్నారని పేర్కొన్నారు. కార్మికులకు తమ యూనియన్ ఇచ్చిన హామీలన్నింటిని నెరవేరుస్తామ న్నారు. ఏరియాలోని తన కార్యాలయంలో ఎప్పుడూ అందుబాటులో ఉంటామని తెలిపారు.

కాంట్రాక్టు కార్మికుల వేతనాలు పెంచండి

శ్రీరాంపూర్, జనవరి 4: కాంట్రాక్టు కార్మికుల వేతనాలు పెంచాలని సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సంఘం (ఎస్‌సీకేఎస్-సీఐటీయూ) రాష్ట్ర కార్యదర్శి బి మధు కోరారు. గురువారం ఆయన నూతనంగా బాధ్యతలు చేపట్టిన సింగరేణి సీఎండీ ఎన్ బలరామ్‌ను కలిసి వినతిపత్రం అందించారు. గతేడాది సమ్మె సందర్భంగా యాజమాన్యంతో చేసుకున్న ఒప్పందంలోని అంశాలను పరిశీలించి, వాటిని అమలు చేయాలని కోరారు. వెంటనే స్పందించిన సీఎండీ కాంట్రాక్టు కార్మికులకు రూ.30 లక్షల బీమా, ఐఎస్ఐని అమలు చేస్తామని, వేతనాల పెంపుదలపై పరిశీలిస్తామని హామీఇచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యుడు మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ

జైపూర్: సింగరేణి గిరిజన ఉద్యోగుల సంక్షేమసంఘం నూతనసంవత్సర క్యాలెండర్లను గురువారం హైదరాబాద్‌లో సీఎండీ బలరాం, డైరెక్టర్ ఈఅండ్ఎం సత్యనారాయణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ సింగరేణి సంస్థ అభివృద్ధిలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో గిరిజనఉద్యోగుల సంక్షేమసంఘం నాయకులు భాస్కర్‌రావు బి నాగేశ్వర్‌రావు, బి పంతుల, శంకర్‌నాయక్, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

సీఎండీని కలిసిన అంబేడ్కర్ సంఘం నాయకులు

మందమర్రి టౌన్: సింగరేణి సీఎండీగా బాధ్యతలు స్వీకరించిన డైరెక్టర్ (ఫైనాన్స్‌అండ్‌పా) బలరాంను గురువారం ఆల్ ఇండియా అంబేడ్కర్ సంఘం నాయకులు సీఎండీ కార్యాలయంలో కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా సింగరేణిలో రూల్ ఆఫ్ రిజర్వేషన్‌కు సంబంధించి లోపాలు జరగకుండా చూడాలన్నారు. ఎస్సీఎస్టీ కార్మికులకు సమస్యలు ఉత్పన్నం కాకుండా చూడాలన్నారు.

సీఎండీని కలిసిన కెంగెర్ల మల్లయ్య



సీఎండీ బలరాంకు మొక్కను అందిస్తున్న ఉద్యోగ నాయకులు

సింగరేణి సీఎండీగా బాధ్యతలు స్వీకరించిన డైరెక్టర్ (పా) బలరాంను గురువారం హైదరాబాద్‌లోని ఆయన కార్యాలయంలో టీబీజీకేఎస్ మాజీవర్కింగ్ ప్రెసిడెంట్ కెంగర్ల మల్లయ్య మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయనతో పాటు పలువురు నాయకులు ఉన్నారు.